31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శనివారం,అక్టోబర్ 10, 2026 పేజీలు : 8

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

**ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 9:** తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ అని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జగిత్యాల ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల, కృష్ణా నగర్, శివవీధి, విద్యానగర్ పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారి విగ్రహానికి పూలమాల వేసి, బతుకమ్మలకు జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అని, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు.విద్యార్థినులు, అధ్యాపకులు సంప్రదాయ -మిగతా 2లో

## ప్రజల సహకారంతోనే
# నేరాల నివారణ సాధ్యం




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 9:** ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యమని, దసరా పండుగకు ఊర్లకు వెళ్లే వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దసరా పండు గ సందర్భంగా చాలా మంది స్వగ్రామా లకు వెళ్తుండటంతో దొంగలు ఇళ్లలో చోరీలకు పాల్పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరా రు. జిల్లా పరిధిలో చోరీల నియంత్రణకు పోలీసు శాఖ అన్ని చర్యలు చేపడుతోందని, రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేశామని తెలిపారు. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం బయటకు కనిపించకుండా పరదా కప్పి ఉంచాలని సూచించారు. విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బును బీరువాలో కాకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని అన్నారు. ఊరికి వెళ్లే ముందు ఇంటి పక్కన ఉన్నవారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రాత్రి సమయంలో ఒక గదిలో లైట్ వెలుగుతూ ఉండేలా చూడాలన్నారు. ఇంటికి సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

## మెడికల్ కళాశాల భవనం
# పూర్తి చేయకపోవడం చేతగానితనం

- డిసెంబర్ 15 లోగా భవనాలు పూర్తి చేయాలి
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 9:** జగిత్యాల మెడికల్ కళాశాల భవనం పూర్తి చేయకపోవడం చేతగానితనమని, డిసెంబర్ 15 లోగా భవనాలు పూర్తి చేయాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పరిపాలన సౌలభ్యం కోసం 10 జిల్లాలను 33 జిల్లాలుగా చేశారని, గురుకుల పాఠశాలలు, వైద్య విద్యకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. జగిత్యాల జిల్లాతో ఏర్పాటైన అన్ని జిల్లాల్లో మెడికల్ కళాశాలల భవనాలు పూర్తయ్యాయని, జగిత్యాల మెడికల్ కళాశాల భవనం మాత్రమే పూర్తి కాలేదని విమర్శించారు. అభివృద్ధి కోసం పార్టీ మారానని చెప్పుకునే ఎమ్మెల్యే ఐదేళ్లు గడుస్తున్నా ఎందుకు భవనాలు పూర్తి చేయలేదని నిలదీశారు. కనీస వసతులు లేక విద్యార్థులు సమ్మె చేయడం చేతగానితనానికి నిదర్శనమన్నారు. మంత్రులు ఇచ్చిన హామీ మేరకు డిసెంబర్ 15 లోగా భవనాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణహిత నది జలాలు వృథాగా పోతున్నా కన్నెపల్లి నుండి నీటిని ఎత్తిపోయడం లేదని, అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తిని, నీటిని ఎత్తిపోసే అవకాశాన్ని వినియోగించుకోకుం డా విద్యుత్ ను పొదుపుగా వాడాలని ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదమని, ఇది రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు ఉదాహరణ అని, 12 గంటలు విద్యుత్ అని చెప్పి 6 గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో కరెంట్ కోతలతో రేవంత్ రెడ్డి చంద్రబాబు పాలన తీసుకొచ్చారని విమర్శించారు. ఎస్సారెస్పీ నుండి 6 టీఎంసీల నీటిని విడుదల చేయాలని, పంటలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12న నిర్వహించే జిల్లాల ఏర్పాటు దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ ఉద్యమకారులు, జేఏసీ నాయకులు, కవులు, కళాకారులను సన్మానిస్తామని, పాత బస్టాండ్ నుండి అంగడి బజార్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే స్వయంగా డాక్టర్ అయి ఉండి కూడా విద్యార్థులను పరామర్శించలేదని దావ వసంత సురేష్ విమర్శించారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, నాయకులు వెంకటేశ్వర రావు, దేవేందర్ నాయక్, వోల్లెం మల్లేశం, గంగారెడ్డి, కల్లెపల్లి దుర్గయ్య, తాటిపర్తి దేవేందర్ రెడ్డి,గాజుల రాజేందర్, ధర రమేష్ బాబు, చందా రాధాకిషన్, శీలం సురేందర్, చేపూరి సుభాష్, శ్రీరామ్ గంగాధర్, గాజుల శ్రీనివాస్, మల్లా రెడ్డి, మామిడిపల్లి మహిపాల్, ధర్మయ్య పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకునేందుకే జీవన్ రెడ్డి విమర్శలు

- త్వరలోనే జగిత్యాల మెడికల్ కాలేజీని సీఎం ప్రారంభిస్తారు
- ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 9:** అభివృద్ధిని అడ్డుకునేందుకే మాజీ మంత్రి జీవన్ రెడ్డి విమర్శలు చేస్తున్నారని, త్వరలోనే జగిత్యాల మెడికల్ కాలేజీని సీఎం ప్రారంభిస్తారని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.సంజయ్ మాట్లాడుతూ జగిత్యాలను అభివృద్ధి చేస్తుంటే సీనియర్ నాయకులు వారి స్థాయి తగ్గించుకుని మాట్లాడుతు న్నారని ఎమ్మెల్యే విమర్శించారు. నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీ భూసేకరణ ఒక స్కామ్ అని, రహదారి లేకుండా, పేపర్లు లేకుండా సీనియర్ నాయకులు భూమిపూజ చేశారని ఆరోపించారు. ఆ స్థలం నిరుపయోగంగా మారిందని, మాజీ ఎంపీ కవిత సహకారంతో డబుల్ బెడ్ రూం ఇళ్లకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. జీవన్ రెడ్డి రెచ్చగొట్టే మాటలతో అభివృద్ధి పనులకు అడ్డం పడుతున్నారన్నారు. కేంద్రం జీఎస్టీ పెంచడం వల్ల మెడికల్ కళాశాల పనులపై 8 కోట్ల అదనపు భారం పడిందన్నారు. జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా ఉండి ప్రభుత్వంతో ఉన్న 7 నెలల్లో మెడికల్ కళాశాల, అర్బన్ హౌసింగ్ పనులు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని, అవసరమైతే సభ్యత్వం తీసుకుంటానన్నారు. మెడికల్ కళాశాల పాత బకాయిలు 40 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రిచే ప్రారంభిస్తామని తెలిపారు. వైద్య విద్యార్థుల నిరసనపై కలెక్టర్ తో కలిసి వెళ్లి మాట్లాడామన్నారు. రోళ్లవాగు ప్రాజెక్టు అటవీ అనుమ తుల కారణంగా ఆలస్యం అవుతోందని, ముంపునకు గురవుతు న్న 827 ఎకరాల అటవీ భూమికి బదులుగా రెవెన్యూ భూమి ఇవ్వడం ద్వారా అనుమతుల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ పనులు, -మిగతా 2లో

## నిర్ణీత గడువులోగా మెడికల్ కళాశాల
# నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనపై ఆర్అం డ్బీ ఇంజినీరింగ్ అధికా రులతో సమీక్ష



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 9 :** జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆర్అండ్బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్అండ్బీ ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, మెడికల్ కళాశాల విద్యార్థి నాయకులతో సమావేశం నిర్వహించారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పురోగతి, విద్యార్థుల సమస్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు.జగిత్యాల మెడికల్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్అండ్బీ ఇంజినీరింగ్ శాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాలలో ఇంకా పూర్తికావాల్సిన -మిగతా 2లో

## కేరళ హైస్కూల్‌లో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు



**చురకలు ప్రతినిధి కోరుట్ల అక్టోబర్ 09 :** పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఏ. బారి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఈ పండుగకు ప్రాచీన చరిత్ర ఉందని తెలిపారు. విద్యార్థులు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలుసుకొని భావితరాలకు వాటి విశిష్టతను అందించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ సెలెన్ బారి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే విశిష్టమైన పండుగ అని పేర్కొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి ప్రకృతిని ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత అని వివరించారు. విద్యార్థులకు బతుకమ్మ పండుగ చరిత్ర, ప్రాముఖ్యత, విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఏ. బారి, ప్రిన్సిపల్ సెలెన్ బారి, చైర్మన్ ఎం.ఏ. హాది, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ విజ్ఞప్తికి స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**-ఎస్ఆర్ఎస్పీ నుంచి సాగునీరు విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు**



**చురకలు ప్రతినిధి కోరుట్ల అక్టోబర్ 09 :** కోరుట్ల నియోజకవర్గంతో పాటు జగిత్యాల జిల్లాలోని రైతుల పంటలకు సాగునీరు విడుదల చేయాలన్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విజ్ఞప్తికి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ) నుంచి సాగునీరు విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. సాగునీరు అందక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి, రైతుల పంటలకు అవసరమైన నీటిని విడుదల చేయాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి, నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఈఎన్సీ) కి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ రమేష్‌తో మాట్లాడి, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా సాగునీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## లక్కీడ్రాలో లక్ష్మికి ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం

**-అల్ అమాన్ ఈవీ కూపన్లలో విజేతగా లక్ష్మి**



**చురకలు విలేఖరి,జగిత్యాల, అక్టోబర్, 09 :** జగిత్యాల జిల్లా రాజారాం గ్రామంలోని అల్ అమాన్ ఈవీ బైక్ షోరూం నూతన ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో రాజారాం గ్రామానికి చెందిన జి.లక్ష్మి విజేతగా నిలిచారు. దీంతో షోరూం యాజమాన్యం ఆమెకు రూ.35వేల విలువైన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా అందజేసింది.షోరూం ప్రారంభోత్సవం రోజున షోరూంకు వచ్చిన ప్రతి కస్టమర్‌కు లక్కీ డ్రా కూపన్లను పంపిణీ చేశారు. ఈ డ్రాలో మొత్తం 2,000 మంది పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు గ్రామ సర్పంచ్ విజయ్, ఉపసర్పంచ్ శీను, అడ్వకేట్ భూమి రమణ, షోరూం యజమాని హాస్ పాషా ఆధ్వర్యంలో చిన్నారి చేతుల మీదుగా లక్కీ డ్రా తీశారు. ఇందులో జి. లక్ష్మి పేరు ఎంపిక కావడంతో షోరూం యజమాని హాస్ పాషా ఆమెకు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

### నిర్ణీత గడువులోగా మెడికల్ కళాశాల

# నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**మొదటి పేజీ తరువాయి....** నిర్మాణ పనులను గుర్తించి, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా తరగతి గదులు, ఇతర అవసరమైన వసతులను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించాలని తెలిపారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్అండ్బీ ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణ పనులన్నింటినీ విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్‌కు, విద్యార్థి నాయకులకు హామీ ఇచ్చారు. పనుల పూర్తిలో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మెడికల్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో పి. మధుసూదన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, ఆర్అండ్బీ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని అడ్డుకునేందుకే జీవన్ రెడ్డి విమర్శలు

**మొదటి పేజీ తరువాయి....** నాలుగు వైపులా డబుల్ రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయని, వెజ్, నాన్ వెజ్ మార్కెట్ త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్,మాజీ మున్సిపల్ చైర్మన్లు అడువల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభూషణం, పిసిసి నాయకులు బండ శంకర్, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుసరి అనిల్, సభ్యులు కత్రోజ్ గిరి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేష్, కాంగ్రెస్ సేవాదళ్ స్టేట్ సెక్రటరీ ముకేష్ ఖన్నా, టౌన్ యూత్ అధ్యక్షులు దయల శరత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

**మొదటి పేజీ తరువాయి...** దుస్తుల్లో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్ ఫారం-7 పత్రాల అంశంలో

# అవకతవకలు లేకుండా చర్యలు తీసుకోండి



**కరీంనగర్, అక్టోబర్ 9 :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భారీ సంఖ్యలో ముందస్తుగా ముద్రించిన ఫామ్-7 అభ్యంతరాలు సమర్పించబడుతున్నట్లు వచ్చిన నివేదికలపై తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి మెమోను ఖచ్చితంగా అమలు చేయాలని, పారదర్శకతతో సమగ్రముగా పరిశీలన చేసి, ఇలాంటి అవకతవకలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఏఐఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎంఐఎం పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ను కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ఒవైసీ ఆదేశాలమేరకు ఈవినతిపత్రం అందజేసినట్లు గులాంఅహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్ల పేర్లను తొలగించాలనే ఉద్దేశంతో భారీ సంఖ్యలో ముందస్తుగా ముద్రించిన, అభ్యంతరకర ఫారం-7 పత్రాలకు సంబంధించి ప్రజల్లో అపోహలు భయాందోళనకు గురవుతున్నటువంటి పరిస్థితుల్లో కట్టుదిట్టమైనటువంటి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాల్లో గ్రేటర్ హైదరాబాద్ లోని ముషీరాబాద్ ప్రాంతంలో ఫారం సెవెన్ పత్రాల కు సంబంధించి బోగస్ పత్రాలు అన్ని తేలిన నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలో ఇలాంటి అంశాలకు తావు లేకుండా పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నాయకులు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, మాజీ కార్పొరేటర్లు ఆరిఫ్ అహ్మద్, అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, లింగపల్లి శ్రీనివాస్, నాయకులు అబ్దుల్ గఫ్ఫార్, సురేశ్, ఖాజా మజారోద్దీన్, వాజిద్ అలీఖాన్, ఎంఏ సలీం, సాజిద్, అబ్దుల్లా ఖాన్, సిరిసిల్ల నాయకులు పర్వేజ్, పెద్దపల్లి నాయకులు ఇమ్రాన్ అడ్వకేట్, ఉమెర్, కలీం తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావంపై అప్రమత్తం

**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 09 :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో కరువు పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మండలాల వారీగా వర్షపాతం లోటును విశ్లేషించడంతో పాటు పంటల పరిస్థితి, భూగర్భ జలాల లభ్యత, తాగునీటి అవసరాలు, గ్రామీణ ఉపాధిపై సమగ్ర నివేదికలు రూపొందించాలని సూచించారు. వర్షాభావ ప్రభావాన్ని తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం రాత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, విద్యుత్ అవసరాలు, ఉపాధి హామీ పనుల అమలు, కరువు మండలాల గుర్తింపు తదితర అంశాలపై సమీక్షించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చిత్రా మిశ్రా ఈ సమావేశంలో పాల్గొన్నారు. లోటు వర్షపాతంపై సమగ్ర అంచనాలి సాధారణ వర్షపాతంతో పోలిస్తే 20 శాతం లేదా అంతకంటే ఎక్కువ లోటు నమోదైన మండలాలను గుర్తించి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సీఎస్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉండగా, 320 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. వ్యవసాయ, ప్రణాళిక శాఖలు సమన్వయంతో పనిచేసి సాధారణ, తీవ్ర కరువు పరిస్థితులపై వివరాలను సేకరించాలని ఆదేశించారు. వర్షాభావంతో పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉన్నందున సాగు విస్తీర్ణం తగ్గిన ప్రాంతాలు, ఎండిపోతున్న పంటలు, నీటి ఒత్తిడికి గురైన పొలాలను గుర్తించాలని సూచించారు.

## పాఠశాలల ఆకస్మిక తనిఖీ చేసిన డీఈఓ



**చురకలు విలేకరి,బీర్‌పూర్, అక్టోబర్ 9 :** జగిత్యాల జిల్లా విద్యాశాఖాధికారి రాము శుక్రవారం బీర్ పూర్ మండలంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు.మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ జీపీ బీర్ పూర్, ఎంపీపీఎస్ ఇంద్రనగర్ కాలనీ, జెడ్పీహెచ్ఎస్ నర్సింలపల్లి పాఠశాలలను తనిఖీ చేశారు.నర్సింహులపల్లి, బీర్ పూర్ పాఠశాలలకు చేరుకున్న డీఈఓకు విద్యార్థినులు ముందస్తు బతుకమ్మలు, పూల అలంకరణలతో ఘన స్వాగతం పలికారు. విద్యార్థుల ఉత్సాహాన్ని,సాంస్కృతిక ప్రతిభను ఆయన అభినందించారు. అనంతరం ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన ప్రగతి అమలును పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థుల చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను స్వయంగా పరీక్షించారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా సాధించాలని, కనీస అభ్యాసన సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట మండల విద్యాధికారి నాగభూషణం, ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఉన్నారు.

## కాంగ్రెస్ పట్టణ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖయ్యూంకు ఫిదా బాయ్స్ సన్మానం



**చురకలు ప్రతినిధి కోరుట్ల అక్టోబర్ 09 :** కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన మైనారిటీ నాయకుడు అబ్దుల్ ఖయ్యూంను శుక్రవారం నాలుగో వార్డు మోమిన్‌పూర్‌కు చెందిన ఫిదా బాయ్స్ సభ్యులు ఘనంగా సన్మానించారు. పూలమాల వేసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఖయ్యూం మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం, యువత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతిరోజూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలతో కలిసి పనిచేస్తూ, వారి సమస్యలను సంబంధిత నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా ఫిదా బాయ్స్ సభ్యులు మాట్లాడుతూ అబ్దుల్ ఖయ్యూం ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సల్మాన్, జునైద్, జీషాన్,అజీమ్, సుజావుద్దీన్, షోయబ్, అంజాద్, ముజీబ్,కలీం,హర్షద్, సులేమాన్,సమీర్ అలీ, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు

**-దసరా సెలవులకు ముందు ఉత్సాహంగా వేడుకలు**
**-సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల సందడి**
**- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (09) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దసరా పండుగ సెలవులకు ముందు పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది.విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. మండలంలోని గోదూర్,తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా,యామాపూర్, ఫకీర్ కొండాపూర్,వేములకుర్తి,బర్దిపూర్, ములరాంపూర్,ఎర్దండి, కోమటి కొండాపూర్,వర్షకొండ, కేశాపూర్,కొజన్ కొత్తూరు, ఇబ్రహీంపట్నం,డబ్బా, ఎర్రాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈవేడుకలు నిర్వహించారు .విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొని పండుగ విశిష్టతను చాటారు.

**తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ...**

బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చడం, వాటి చుట్టూ చేరి పాటలు పాడటం తెలంగాణ మహిళల ప్రత్యేక సంప్రదాయమని వివరించారు.ఇలాంటి వేడుకల ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు.పండుగల ప్రాముఖ్యతను భావితరాలకు తెలియజేయడంలో పాఠశాలల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

**దసరా సెలవులతో విద్యార్థులకు విరామం...**

మరోవైపు దసరా పండుగ సెలవులు ప్రారంభం కానుండటంతో విద్యార్థుల్లో ఆనందం నెలకొంది. పండుగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకునేందుకు విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.సెలవుల సమయంలో పండుగ ఆనందాన్ని ఆస్వాదిస్తూనే చదువులపై కూడా శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండల విద్యాశాఖ అధికారి బండారి మధు పర్యవేక్షణలో మండలంలోని పాఠశాలల్లో విద్యా కార్యక్రమాలు కొనసాగాయి. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను ఆనందంగా జరుపు కోవాలని ఎంఈఓ, ఉపాధ్యాయులు సూచించారు.

# దసరా సెలవులకు ఊరు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

**-ఇబ్రహీంపట్నం ఎస్ ఐ నవీన్ కుమార్**




**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (09) :** దసరా సెలవుల సందర్భంగా స్వగ్రామాలకు,ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల ఎస్.ఐ నవీన్ కుమార్ శుక్రవారం సూచించారు. పండుగ సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే సమయంలో దొంగతనాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.ఊరికి వెళ్లే ముందు ఇంటి తలుపులు, కిటికీలు సక్రమంగా మూసివేసి తాళాలు వేసుకోవాలని, విలువైన బంగారు ఆభరణాలు, నగదు వంటి వాటిని ఇంట్లో ఉంచకుండా సురక్షిత ప్రదేశాల్లో భద్రపరుచు కోవాలన్నారు.ఇంటి బయట తాళాలు కనిపించేలా నిర్లక్ష్యంగా ఉండకూడదని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కొత్త వ్యక్తుల కదలికలను గమనించాలని, ఎక్కువ రోజులు ఇంటికి దూరంగా ఉండాల్సి వస్తే నమ్మకమైన పొరుగువారికి సమాచారం అందించాలన్నారు .ప్రయాణ సమయంలో వాహనదారులు రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రయాణ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారు.ప్రజలు పోలీసులకు సహకరిస్తూ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై నవీన్ కుమార్ కోరారు. ఎక్కడైనా అనుమానాస్పద కదలికలు కనిపించినా, దొంగతనానికి సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని ఎస్.ఐ సుచించారు.

# ఎల్ఐసీ ఏజెంట్‌గా జీవన్ 20 ఏళ్ల ప్రస్థానం

**- దేశెట్టి జీవన్ దంపతులకు సన్మానం**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (09) :** ఎల్ఐసీ ఏజెంట్‌గా 20 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని డబ్బ గ్రామనికి చెందిన దేశెట్టి జీవన్‌ను ఎల్ఐసీ అధికారులు, తోటి ఏజెంట్ మిత్రులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం మెట్‌పల్లి బాంక్వెట్ హోటల్‌లో ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎల్. రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్గనైజేషన్ సమావేశంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.గత 20 ఏళ్లుగా జీవన్ పాలసీదారులకు వివిధ రకాల సేవలు అందిస్తూ, వృత్తిపట్ల బాధ్యత, అంకితభావం, సమయస్ఫూర్తితో ముందుకు సాగుతున్నారని అధికారులు, ఏజెంట్ మిత్రులు కొనియాడారు. పాలసీదారులకు నిరంతరం సేవలందిస్తూ రెండు దశాబ్దాల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకోవడం అభినందనీయమని పేర్కొంటూ జీవన్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎల్. రాజేందర్ రెడ్డి, మెట్‌పల్లి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ కె. రామశర్మ, మేనేజర్ ఐ. రామకృష్ణ, సీనియర్ ఏజెంట్లు బొడిగె నారాయణ గౌడ్, కంతం భరత్, పెంట లింబాద్రి, సామల విష్ణు, గోకల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణహిత బతుకమ్మ వేడుకలు




**చురకలు, విలేఖరి,వెల్గటూర్,అక్టోబర్ 09 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పాషిగామ ప్రభుత్వ ప్రాథమికపాఠశాలలోశుక్రవారం పర్యావరణ హితమే లక్ష్యంగా బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు.పర్యావరణ పరిరక్షణనే భవిష్యత్తు తరాల కు తరగని ఆస్తని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలం సంపత్ కుమార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు గ్రీన్ బ్యాడ్జీలు ధరించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉంటూ, ప్రకృతిలో సహజంగా లభించే పూలతో బతుకమ్మల ను తయారు చేసుకోవాలన్న సందేశాన్ని అందించారు. తెలంగాణ సంస్కృతి,సాంప్ర దాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రకృతి పరిరక్షణతో ముడిపెట్టి నిర్వహించడంవల్ల చిన్నారు ల్లో పర్యావరణ స్పృహను పెంపొందిస్తే భవిష్యత్తు తరాల వారికి ఆరోగ్యకరమైన వాతావరణాన్నిఅందించవచ్చని ఉపాధ్యాయులు వివరించారు.విద్యార్థుల్లో పర్యావరణ ప్రేమను పెంపొందించడంతో పాటు, ప్రకృతినిగౌరవించడం, సహజ వనరులను సంరక్షించ డం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి మంచి అలవాట్లను చిన్ననాటి నుంచే అలవరచుకోవాలనే ఉద్దేశంతో ఈకార్యక్రమంనిర్వహించారు."పండుగలు ప్రకృతికి హాని కలిగించేవిగా కాకుండా, ప్రకృతిని కాపాడేవిగా ఉండాలి" తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాంద్రపు శిరీష, ఉపాధ్యాయు లు మహేష్, ప్రణీత, కావేరి, సహాయక బృందం రామక్క, ప్రవళిక, ఏఎన్ఎం అనురాధ, ఆశా కార్యకర్త జ్యోతి, అంగన్వాడీ టీచర్ రాజేశ్వరి, సిఏ ప్రమీల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో మరిన్ని సేవలు అందించాలి




**చురకలు విలేకరి,రాయికల్, అక్టోబర్ 9 :** విద్యా రంగంలో మరిన్ని సేవలు అందించాలని లయన్ క్విస్ట్ ప్రోగ్రాం చైర్మన్ పోతాని ప్రవీణ్ అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన నేషనల్ బెస్ట్ మేనేజ్మెంట్ సిస్టమ్ అవార్డు 2026 పొందిన ప్రగతి స్కూల్ యాజమాన్యం బాలే శేఖర్,బాలే నిఖిల్‌లను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మేమెంటో సాల్వతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పరుగులు మాట్లాడుతూ విద్యారంగంలో ఉత్తమ నిర్వహణ విధానాలతో గుర్తింపు పొందడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని లయన్స్ క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు.విద్యా సంస్థల అభివృద్ధికి,విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడే కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్,కోశాధికారి సుధావేణి మురళి గౌడ్,బత్తిని భూమయ్య,మ్యాకల రమేష్,మచ్చ శేఖర్,దాసరి గంగాధర్, ఆడెపు రాంప్రసాద్,సామల్ల సత్యనారాయణ,బెక్కం తిరుపతి,సాంబారు శ్రీనివాస్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**చురకలు విలేకరి,బీర్‌పూర్,అక్టోబర్ 9 :** బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సహకారంతో తోట ప్రమీలకు మంజూరైన రూ. 88,000 విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కును శు క్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ కష్టకాలంలో సీఎం సహాయనిధి చెక్కు మంజూరు చేయించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సల్ల వినోద లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జోగి రెడ్డి, మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ,ఉపసర్పంచ్ నారపాక రమా రమేష్,వార్డు మెంబర్లు,పాల్గొన్నారు.

# అభివృద్ధి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 9 :** వివిజిరాంజీ కింద జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ భవనాలు, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు, పాఠశాలల్లో వంటశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా పూర్తి కావాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగపడే ఈ నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్మాణాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపట్టిన పనులు ప్రజలకు త్వరగా అందుబాటులోకి వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో వంటశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే గ్రామ పంచాయతీ, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈ.ఈ.పీ.ఆర్. లక్ష్మణరావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ఎండాకు,సుడిదోమ తెగులు నివారణ చర్యలు

**-ఏ ఓ సాయికిరణ్**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 09 :** వరి తెగులు,నివారణ చర్యల గురించి మండల వ్యవసాయాధికారి సాయికిరణ్ రైతులకు పలు సూచనలు చేశారు.వరి ఎండాకు తెగులు, బాక్టీర్య తెగులు ఆకుల అంచుల నుండి నీటిలో నానినట్లుగా పసుపు రంగు మచ్చలు మొదలై,తర్వాత అంచులు అలల రూపంలో ఎండిపోయి తెల్లగా లేదా గోధుమ రంగులో కి మారతాయి.పసుపు పచ్చ జిగురు వంటి బాక్టీరియా ఎండ వేడిమికి గట్టిపడి చిన్న చిన్నఉండలు ఏర్పడతాయని వీటిని నివారించడానికి నత్రజని ఎరువులు వేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలి.పొలం నుండి నీటిని తీసి వేయాలి.ప్లాంటేమైసిన్ 0.5 గ్రా.కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.అగ్రిమైసిన్ 0.4 గ్రా.కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3గ్రా, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని,పైన తెలిపినవి ఏదో ఒక దానిని 5,7 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీచేయాలని తెలిపారు.సుడి దోమ,పిల్ల, పెద్ద దోమలు నీటి పై భాగంలో దుబ్బల మొదల్ల దగ్గర నుండి రసం పీల్చడం వలన పైరు లేత పసుపు వర్ణానికి మారుతుంది. పైరుసుడులుగావలయాకారం లో ఎండిపోయి ఉంటుంది. దీనికి నివారణగా నత్రజనిఎరువులని వేయడంవాయిదా వేయాలి. డైనోటెపురాన్ 20%ఎస్ జి 0.4గ్రా, లేదా పైమెట్రిజైన్ 50%డబ్ల్యూ జి 0.6 గ్రా, లేదా ట్రైపులు మెజాపైరిమ్ 20%డబ్ల్యూ జి లేదా ఇమిడాక్లోప్రిడ్ 40%ంఎతిప్రోల్ 40 %డబ్ల్యూ జి 0.25 గ్రా, లీటర్ నీటిని కలిపి పిచికారి చేయాలి. పురుగు మందులు పిచికారీ చేసే ముందు పొలంలో నీటిని తగ్గించి పాయలు తీసి మొదల్ల పై పడేట్లు పిచికారీ చేయాలన్నారు. వెల్గటూర్ మండలంలో వరికి ఈ తెగుళ్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించిన ట్లు పేర్కొన్నారు.

### కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో

# డిప్యూటీ డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**-సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలి : డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 09 :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అందుకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి (డిప్యూటీ డీఎంహెచ్ఓ) డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి సూచించారు.శుక్రవారం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో గర్భిణులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. గర్భిణులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. తల్లులు, శిశువుల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ నియంత్రణకు సంబంధించిన సేవలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించాలని తెలిపారు. వైద్యులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్ల పనితీరును సమీక్షించారు. ప్రసవాలు జరిగిన మహిళలను కలిసి ఆసుపత్రిలో అందుతున్న వసతులపై వివరాలు సేకరించారు. అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. వైద్య సేవలు, సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీతారాణి, వైద్యురాలు చైతన్య సుధ, విజయలక్ష్మి, వైద్యులు వినోద్, రమేష్, లక్ష్మి , సూపర్వైజర్లు ధనుంజయ, నాగభూషణ్, రబ్బాని, నరేందర్, రియాజ్, ఇమ్రాన్, ల్యాబ్ సాజిత్ అలీ, శ్రీధర్, చారి, మిరియం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రాచర్ల బొప్పాపూర్ శివ పరాశక్తి పీఠానికి నాగ సాధువుల రాక

**-శివయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు**
**-పీఠాధిపతి చేతిలో స్పటిక లింగం సృష్టించి అందజేత**
**-శివనామ స్మరణ.. ఆధ్యాత్మిక పరిమళాలు**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 09 :** పరమశివుడిపై అపార భక్తి భావం నిండిన వాతావరణంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని శివ పరాశక్తి పీఠంప్రత్యేక ఆధ్యాత్మిక సందర్శనకు వేదికైంది. కాశీలోని బడా హనుమాన్ ప్రాంత అఖాడాకు చెందిన ఎనిమిది మంది నాగ సాధువులు పీఠాన్ని సందర్శించి, పరమశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.శివ పరాశక్తి పీఠం ప్రాముఖ్యతను తెలుసుకుని వచ్చిన నాగ సాధువులు పీఠాధిపతి మనోహర్ రాజు గురూజీతో పీఠం విశిష్టత గురించి మాట్లాడారు. అనంతరం పీఠంలోని శివయ్యను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కాశీ క్షేత్రానికి చెందిన నాగ సాధువులు పీఠాన్ని సందర్శించడం స్థానికంగా ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించుకుంది.

**గురూజీ చేతిలో స్ఫటిక లింగం సృష్టించి అందజేత.**

ఈ సందర్భంగా నాగ సాధువులు పీఠాధిపతి మనోహర్ రాజు గురూజీ చేతిలో పూలు ఉంచి,తమ మహిమలతో స్పటిక లింగాన్ని సృష్టించి అందజేశారు. ఈ ఘటన పీఠంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.సనాతన ధర్మ సంప్రదాయాల్లో శివారాధనకు, స్పటిక లింగానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఈ సందర్భంగా భక్తులు గుర్తుచేసుకున్నారు.

**నాగ సాధువుల రాక మా అదృష్టం.**

కఠోర నిష్ఠతో, అచంచల శివభక్తితో ఆధ్యాత్మిక జీవనం సాగించే నాగ సాధువులు తమ పీఠాన్ని సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నామని పీఠాధిపతి మనోహర్ రాజు గురూజీ, ఆయన సతీమణి పద్మ తెలిపారు. పరమశివుడి అనుగ్రహంతో పీఠానికి వచ్చిన సాధువులకు స్వాగతం పలుకుతూ, వారి సందర్శన తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు.శివభక్తి, సాధుసాంగత్యం, ఆధ్యాత్మిక సంప్రదాయాల కలయికగా సాగిన నాగ సాధువుల పర్యటనతో రాచర్ల బొప్పాపూర్ శివ పరాశక్తి పీఠంలో భక్తిభావ వాతావరణం నెలకొంది.

# తొలగించిన ఓట్లను మళ్లీ ఓటర్ లిస్టులో చేర్చాలి

**-ఎస్ఐఆర్ పేరిట ఓట్ల తొలగించడానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలే సూత్రధారులు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 09 :** భారత దేశంలో ఎస్ఐఆర్ పేరిట ఓట్ల తొలగించడానికి ప్రధాని మోదీ,కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలే సూత్రధారులని ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిది రాజేందర్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య జిల్లా మైనార్టీ సెల్ మాజీఅధ్యక్షులు సాహెబ్ ఆరోపించారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాతబస్టాండులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూడిది రాజేందర్ ఆధ్వర్యంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం ఓట్లను తొలగించినందుకు నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ లిస్ట నుండి తొలగించిన ఓట్ల అన్నిటిని తిరిగి చేర్చాలని వారు డిమాండ్ చేశారు. తొలగించిన ఓట్లను చేర్చే దాకా కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు చేపడు తూనే ఉంటుందన్నారు.మోదీ, అమిత్‌షాను ఎస్ఐఆర్ తప్పులను కప్పిపుచ్చుతున్నారని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ బిజెపి ప్రభుత్వానికి తొత్తుగా మారినాడని వ్యాఖ్యానించారు. గతంలో ఎప్పుడూలేని విధంగా దరఖాస్తులు నింపమనడం, అనవసరమైన పత్రాలుచూపించమనడం వంటి చర్యలతో దేశ ప్రజలను ఇబ్బంది పెట్టిన ఘనత ఈసీకే దక్కిందన్నారు. ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఇల్లు మారారని, ఇంట్లో లేరని.. ఇలా రకరకాల కారణాలతో పేదల ఓట్లు తొలగించారని చనిపోయారంటూ బతికున్నవాళ్ల ఓట్లు తొలగించారు" అని వారు ధ్వజమెత్తారు. తొలగించిన ఓట్లపై రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ సోషల్ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయన్నారు బీజేపీ, కార్యాలయాల నుంచి అందిన దొంగ ఫిర్యాదులతో పెద్ద సంఖ్యలో ముస్లింలు, క్రిస్టియన్ల ఓట్లు తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని వారు ఆరోపించారు.ఓటును ప్రజలకు దూరం చేసేలా బీజేపీ కుట్ర చేస్తున్నాయని వారు విమర్శించారు. ఓటర్ లిస్టులో ఓటు లేకపోతే సచ్చిన కిందికే లెక్క అని వారన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాపురెడ్డి ఏఎంసి డైరెక్టర్ గుళ్ళపల్లి లక్ష్మారెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి,బండారి బాల్రెడ్డి, మేడిపల్లి దేవానందం,దండు శ్రీనివాస్ ముదిరాజ్, సత్తయ్య పందిళ్ళ లింగంగౌడ్ పందిళ్ళ శ్రీనివాస్ గౌడ్,తిరుపతిగౌడ్ సురేందర్, రాజేందర్ రెడ్డి పోచయ్య ,రవి చరణ్ గౌడ్, రఫీక్ , ఎల్లా గౌడ్ ఉప్పుల రవి జితేందర్ వెంకటేష్ నూకల మల్లేష్ యాదవ్ తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్‌కు
# ఘనస్వాగతం పలికిన పార్టీ శ్రేణులు




**కరీంనగర్, అక్టోబర్ 09 :** ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ ఏఐఎంఐఎం పార్టీ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గా సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ను, పార్టీ అధ్యక్షుడు బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కు, హైదరాబాద్ దారుస్సలాంలో నియామకపు ఉత్తర్వులను బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ అందజేశారు. గ్రూపు రాజకీయాలను, వర్గ విభేదాలను పక్కన బెట్టి ఎంఐఎం బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, కరీంనగర్ జిల్లా, పట్టణ కమిటీకి దిశానిర్దేశం చేశారు. కలిసి కట్టుగా ఉండి పార్టీని పటిష్టపరిచేందుకు కృషి చేయాలని కోరారు. తనపై గురుతరమైనటువంటి బాధ్యతతో కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జిల్లాల అధ్యక్షుడిగా నియమించిన ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీకి గులాం అహ్మద్ హుస్సేన్ సర్వదా కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ పెద్దపల్లి సిరిసిల్ల జిల్లాల్లో పార్టీ అభివృద్ధి కోసం తన శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించి, మొదటిసారి కరీంనగర్ కు విచ్చేసిన గులాం అహ్మద్ హుస్సేన్ కు పార్టీ శ్రేణులు, యూత్ అలుగునూర్ చౌరస్తా వద్ద పూలమాలలు, శాలువాలతో ఘనస్వాగతం పలికారు. వందల వాహనాలతో కరీంనగర్ నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కరీంనగర్ జిల్లా పార్టీ కార్యాలయం దారుస్సలాం వద్ద భారీ ఎత్తున టపాసులు కాల్చి, స్వీట్లు పంచారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మురికి కాలువల నిర్మాణ పనులకు భూమి పూజ



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట ఆక్టోబర్ 09 :** ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామపంచాయతీలోని 8,9వార్డులలో 4 లక్షల వేయంతో శు క్రవారం మురికి కాలువ నిర్మాణ పనులకు సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి వార్డ్ మెంబర్స్ నాగవేణి లత ఏలూరి రజిత చెంద్ర రెడ్డి ప్రసాద్ బొమ్మనవేణి కృష్ణ వెంకటేష్ ల్యాగల సతీష్ రెడ్డి ఏలూరి శ్రీనివాస్ లంబ కుమార్ భాను కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాగుల చరణ్‌గౌడ్ బర్డ్ వేడుకలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 09 :** ఎల్లారెడ్డిపేట మండలం కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు వెంకటాపూర్ గ్రామానికి చెందిన రాగుల చరణ్ గౌడ్ బర్డ్ వేడుకలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూడిది రాజేందర్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య చరణ్‌గౌడు జన్మదినం సందర్భంగా శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు మరెన్నో జన్మదినోత్సవాలు జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు జన్మదిన వేడుకలలో రాజన్నపేట సర్పంచ్ కల్లూరి బాపురెడ్డి అల్మాస్పూర్ సర్పంచ్ వెంకటరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతూరి భూపాల్ రెడ్డి బండారి బాల్రెడ్డి, మేడిపల్లి దేవానందం మల్లారపు రాజేందర్ రెడ్డి మర్రి శ్రీనివాస్ రెడ్డి సాహెబ్ పందిర్ల లింగాగౌడ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 09 :** వీణవంక మండల కేంద్రంలోనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం. కుమార్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి.విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు, ఆటలతో కళాశాల ప్రాంగణంలో పండుగ శోభను నింపారు.?ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీక అని, విద్యార్థుల్లో సాంస్కృతిక స్పృహ, ఐక్యతను పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు నాగవెల్లి రామ్మోహన్, అధ్యాపకులు భాస్కర్, శోభన్‌బాబు, జైపాల్‌రెడ్డి, రవీందర్, కల్పన, శైలజ, స్వప్న, అరుణ, సుమలత ,బోధనేతర సిబ్బంది తాజోద్దీన్, జమీల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య



**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 09 :** వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి సమ్మయ్య అనారోగ్యంతో మృతిచెందగా, విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య వెంటనే వెళ్లి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి, తక్షణ సాయంగా మృతుడి కుమారుడు రాజ్ కుమార్‌కు 2,000 ఆర్థిక సాయం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.వీరి వెంట గట్టు కుమార్, తాటిపాముల రాజు, ఇష్టవేన రాజయ్య, బొంగుని ఎల్లయ్య, కురుమేండ్ల శంకరయ్య తదితరులు ఉన్నారు.

## ముందస్తు బతుకమ్మ సంబరాలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 9 :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘన్‌పూర్‌దాస్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రముఖ పాఠశాల అయిన యూనివర్సల్ నోట్ ఐ.ఐ.టి ఫౌండేషన్ హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.కార్యక్రమంలో భాగంగా పాఠశాల బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి తెచ్చారు. బాలికలు వారి సాంస్కృతిక పాటలు,బతుకమ్మ పాటలతో ఆటపాటలతో సందడి చేశారు.చక్కగా అలంకరించిన పెద్ద బతుకమ్మ, త్రిభుజ బతుకమ్మలకు మరియు చిన్న బతుకమ్మలకు కూడా యాజమాన్యం వారు బహుమతులు బహుకరించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట మహమ్మద్ ఇస్మాయిల్ మరియు ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అష్ఫాక్ పండుగ ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులను అభినందించారు.

## మంత్రులకు ఆహ్వానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 9 :** కమాన్ పూర్ మండల కేంద్రంలోని సుభాష్ నగర్ లో సుభాష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని పోతుల కుమార్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రాన్ని మంత్రి శ్రీధర్ బాబుకు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్కు, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ బాబులకు ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ నెల 11 నుండి కమాన్ పూర్ మండల కేంద్రంలోని సుభాష్ నగర్ వాటర్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసే దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ హైదరాబాద్లో ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మల్యాల రామ్ చంద్రం గౌడ్, గట్టు ఆకాష్,పెండ్యాల అజయ్, నల్లవెల్లి ఈశ్వర్ వెంగలి అవినాష్ గౌడ్ అఖిల్ తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు కృషి చేస్తాం

**-ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణారావు**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి,)అక్టోబర్ 09 :** సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లి లోని డాక్టర్ విజయ ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులతో ఆయన ప్రత్యేక ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు జర్నలిస్టులు తమ చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాలు, ఇండ్ల మంజూరు అంశంపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించగా,ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సమాజానికి,ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పారదర్శకంగా,వేగవంతంగా సాగేందుకు యూనియన్లు, సంఘాలతో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారమే ధ్యేయంగా జర్నలిస్టులంతా కలిసి ఒక ఐదుగురు సభ్యులతో కూడిన సమన్వయ కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.ఆ కమిటీ ముందుకు వస్తే అధికారులతో మాట్లాడి అవసరమైన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.సుల్తానాబాద్, ఓదెల మండలాలతో పోలిస్తే పెద్దపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో స్థల లభ్యత కొంత క్లిష్టంగా ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల జాడను గుర్తించేందుకు అధికారులు నిరంతరం అన్వేషిస్తున్నారని వివరించారు.నియోజకవర్గ పరిధిలో ఎక్కడైనా అనువైన ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉంటే, సంబంధిత సర్వే నంబర్లను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని జర్నలిస్టులకు సూచిస్తూ,అధికారులతో కలిసి సమష్టిగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆయన పూర్తి భరోసా ఇచ్చారు.ఈ ఆత్మీయ సమ్మేళనంలో పెద్దపల్లి నియోజకవర్గం లోని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఆందోళనలతో అట్టుడుకుతున్న “కొత్తగట్టు”

**-ఆరవరోజుకు చేరిన దీక్షలు**
**-వరంగల్ కరీంనగర్ నేషనల్ హైవే పై అండర్ పాస్ నిర్మించాలని డిమాండ్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 9 :** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో కొత్తగట్టు గొల్లపల్లి గ్రామ ప్రజల సౌకర్యం కోసం వరంగల్ కరీంనగర్ నేషనల్ హైవేపై అండర్పాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన దీక్షలు శుక్రవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. గ్రామానికి చెందిన పలువురు దీక్షలో పాల్గొన్నారు. ప్రతిరోజు ధర్నా రాస్తారోకో నిర్వహిస్తున్నారు. నేషనల్ హైవే రహదారి నిర్మాణంతో గ్రామాలు రెండుగా చీలిపోయాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము మంత్రులకు ఎమ్మెల్యేలకు కేంద్రమంత్రికి మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోవడంలేదని వారన్నారు. గ్రామంలో రోడ్డు ప్రమాదాలు జరిగి ఇప్పటికే పలువురు మృతి చెందారని తెలిపారు. ఇంకా చాలామంది వృద్ధులు పిల్లలు రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. నేషనల్ హైవే అధికారులు అండర్ పాస్ కాకుండా.. ప్రత్యామ్నాయంగా రాంపు నిర్మించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఇది తగదని ఇది పూర్తి ప్రత్యామ్నాయం కాపుదని దీంతో రోడ్డు ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ గ్రామ సమస్యపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు ఆందోళన కొనసాగుతుందని వారు హెచ్చరించారు. రహదారి నిర్మాణం కారణంగా రైతులు పొలాలకు వెళ్లలేకపోతున్నారని రోడ్డుకి ఇటువైపున ఉన్న గ్రామస్తులు అటువైపు అటువైపు ఉన్నవారు ఎటువైపు రాలేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. నేషనల్ హైవే చిరు వ్యాపారులను దెబ్బతీసిందని, రోడ్డు ప్రమాదాలకు నిలయమైందని, భూముల ధరలు తగ్గి రైతులు ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఆరో రోజు నిరసనలో రాజు, పూదరి నరేష్ తిరుపతి అజీమ్, అన్నాడి సంపత్ రెడ్డి, శ్రీనివాస్, రవి, గంట రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ బాధ్యత

# గ్రామపంచాయతీలకే అప్పగించాలి

**-బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షుడు సందేల వెంకన్న డిమాండ్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్, అక్టోబర్ 9 :** ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ బాధ్యతను గ్రామపంచాయతీలకు అప్పగించాలని బీసీ జేఏసీ హుజురాబాద్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షుడు సందేల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.హుజురాబాద్ పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన బీసీ జేఏసీ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, గ్రామపంచాయతీలకు ప్రజాప్రతినిధులు ఎన్నికైన తర్వాత కూడా గతంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలను కొనసాగించడం సమంజసం కాదన్నారు. స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఏర్పాటు చేసిన కమిటీల ద్వారా గ్రామపంచాయతీల పాలకవర్గాల అధికారాలు నిర్వీర్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా ఇందిరమ్మ కమిటీలను తక్షణమే రద్దు చేసి, ఇళ్ల పంపిణీ బాధ్యతను గ్రామపంచాయతీలకు అప్పగించాలని కోరారు.తద్వారా అసలైన నిరుపేదలకు ఇళ్లు మంజూరయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వన్నాల శివాజీ, బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మామునూరు ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతికుమార్, బీసీ జాతీయ సంక్షేమ సంఘం హుజురాబాద్ నియోజకవర్గ మహిళా జనరల్ సెక్రటరీ దేవసాని ప్రియదర్శిని, ప్రజాసంఘాల నాయకులు రామ్ సారయ్య, బండ తిరుపతి, దాట్ల ప్రభాకర్, పోగు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్‌ను రద్దు చేయాలి

**-ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలి**
**-ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన**
**-సంఘీభావం తెలిపిన సిపిఐ నాయకులు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పెద్దపల్లి) అక్టోబర్ 9 :** ఎస్ ఐ ఆర్ ను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే బర్తరఫ్ చేయాలని,పాత పద్ధతిలో ఎన్నికల కమిషనర్లను నియమించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ముస్లిం ఐక్యవేదిక నాయకులు నిరసన తెలిపి అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ నిరసన కార్యక్రమానికి పెద్దపెల్లి జిల్లా సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ముస్లిం ఐక్యవేదిక నాయకులు, సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానంద మాట్లాడుతూ సుమారు 146 కోట్ల జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో,భారత ఎన్నికల కమిషన్ లెక్కలప్రకారం 18 సంవత్సరాల పైబడిన ఓటర్లు సుమారు 99.1కోట్ల మంది ఉన్నారు.ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ ఐ ఆర్) పేరుతో ఓట్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని, ఇప్పటికే 13 కోట్ల ఓటర్లను తొలగించినట్లు, 2024 నుండి ఇప్పటివరకు నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం జరపలేదని,ప్రజాస్వామ్యంలో పౌరులకు ఉండే ప్రాథమిక ఓటు హక్కును హరించడమేనని,ఈ చర్యల ద్వారా ఓటర్లు నాయకులను ఎన్నుకోవడం కాకుండా,నాయకులే ఓటర్లను ఎంపిక చేసుకునే రీతిలో సాగడం అప్రజాస్వామ్యకమే కాక నియంతృత్వ పోకడని దుయ్యబట్టారు.గతంలో (2023 ముందు) ఎన్నికల కమిషనర్లను నియమించే కమిటీలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు మరియు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండేవారని,ఆ నియామకం నిష్పక్షపాతంగా ఉండేదని, కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ మరియు ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు మరియు పదవీ కాలం) చట్టం, 2023 ను తీసుకువచ్చి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కమిటీ నుండి తొలగించి కేవలం ప్రధానమంత్రి, ప్రధానమంత్రిచే నియమించబడే కేంద్రమంత్రి మరియు ప్రతిపక్ష నాయకుడితో కూడిన కమిటీని ఏర్పాటు చేశారని,ఇది అధికారంలో ఉన్న వారికి అనుకూలంగా పనిచేసే వారిని నియమించుకోవడానికి దారితీసిందని, దీనివలన మొత్తం ఎన్నికల విధానమే అనుమానాస్పదంగా తయారైందనీ, ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల తొలగింపు ప్రక్రియ దీనిని స్పష్టంగా రూఢి చేస్తున్నదనీ, ఇదంతా ఏకాకపక్షంగా చేస్తున్న ప్రధాన ఎన్నికల అధికారిగా కొనసాగుతున్న జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని లేదా బర్తరఫ్ చేయాలని,ఎన్నికల అధికారుల నియామకాన్ని పాత పద్ధతిలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భాగస్వామ్యంతో ఉండే నిష్పక్షపాత ఎంపిక కమిటీ ద్వారా జరిపేలా చూడాలని, మరియు ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జామా మసీదు మౌలానా మహమ్మద్ అజీముద్దీన్ అహ్మద్ ముస్లిం నాయకులు సయ్యద్ మస్రత్, అబ్దుల్ హై జావిద్, ఎంఐ మోహీద్, కౌన్సిలర్లు మీర్జా షంషేర్ బేగ్,అస్లాం పర్వేజ్, సల్మాన్, అష్రఫ్, యూనిస్ ఖాన్, నదీమ్, ముస్లిం నాయకులు రఫీ ఉల్లా ఖాన్, మెహరాజ్, ఇమ్రాన్,బొడ్డుపల్లి శ్రీను, భూతగడ్డ సంపత్ , సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బాలసాని లెనిన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, కుక్క శ్రావణ్ కుమార్, అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 11న డాక్టర్ బాలగోపాల్ సంస్మరణ సభ

**-ప్రధాన ప్రసంగం చేయనున్న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయవాది బేలా భాటియా**
**-ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలి: డాక్టర్ ఎస్. తిరుపతయ్య**



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ అక్టోబర్ 9 :** ప్రముఖ మానవ హక్కుల ఉద్యమకారుడు డాక్టర్ కె. బాలగోపాల్ సంస్మరణ సభ ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హుజూరాబాద్ పట్టణంలోని వి.ఎల్.ఆర్.ఫంక్షన్‌హాల్లో నిర్వహించనున్నట్లు మానవ హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. తిరుపతయ్య తెలిపారు.ఈ మేరకు ఆయన వీడియో సందేశం ద్వారా వెల్లడించారు.ఈ సంస్మరణ సభలో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయవాది,మానవ హక్కుల నాయకురాలు బేలా భాటియా “నేటి సందర్భానికి బాలగోపాల్ హక్కుల దృక్పథం” అనే అంశంపై ప్రధాన ప్రసంగం చేయనున్నారు. మానవ హక్కుల వేదిక నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, డాక్టర్ బాలగోపాల్ సన్నిహితులు కూడా సభలో ప్రసంగించనున్నారు. ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాల బాధ్యులు, ఆలోచనాపరులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, బాలగోపాల్ ఆలోచనా విధానాన్ని సమర్థించే వారంతా పెద్ద సంఖ్యలో హాజరై సంస్మరణ సభను విజయవంతం చేయాలని డాక్టర్ తిరుపతయ్య విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యంపై యువత దృష్టి సారించాలి

**-కల్వచర్లలో నూతన జిమ్ ప్రారంభం**
**-సర్పంచ్ శారద కుమారస్వామి**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (రామగిరి) అక్టోబర్ 9 :** యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నిత్యం వ్యాయామం చేయాలని కల్వచర్ల సర్పంచ్ రెండ్ల శారద కుమారస్వామి సూచించారు. రామగిరి మండలం కల్వచర్లలో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను గోదావరిఖని ఏసిపి మడత రమేష్‌గౌడ్,రామగిరి ఎస్సై తాడ వేని శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, వ్యాయామాన్ని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు.జిమ్ ద్వారా అందుబాటులోకి వచ్చిన సదుపాయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జిమ్ నిర్వాహకుడు ముజీబ్ కుమారుడు మహమ్మద్ సమీ యువతకు వ్యాయామ సదుపాయాలు కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. నిర్వాహకులు సర్పంచ్, ఏసిపి, ఎస్సై లను సన్మానం చేశారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**-బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వివరించిన ప్రిన్సిపాల్ సుగుణ**



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ అక్టోబర్ 9 :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుగుణ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టత, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రసాద్,విజయేందర్ రెడ్డి,మురళీమోహన్,తులసీదాసు,రాజశేఖర్, మల్లారెడ్డిలతో పాటు అధ్యాపకురాళ్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని బతుకమ్మ సంబరాల్లో సందడి చేశారు.

## వి.ఎస్.ఆర్.డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ అక్టోబర్ 9 :** హుజూరాబాద్ మండలం సింగాపురంలోని వి.ఎస్.ఆర్. డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థినులు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం పూల సౌరభంతో,పండుగ వాతావరణంతో కళకళలాడింది. విద్యార్థులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించి పండుగ విశిష్టతను చాటిచెప్పారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి అజయ్ కుమార్,కల్చరల్ ఆర్గనైజర్ ఎన్. రమాదేవి, అధ్యాపకులు కోమల,రచన,తిరుపతి,సదయ్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతం చేశారు.

## గిరిజన తండాలపై ఎక్సైజ్ దాడులు

**-ఇద్దరి అరెస్ట్..8 లీటర్ల ఐడి లిక్కర్ స్వాధీనం**
**-200లీటర్ల ఎఫ్ జె వాష్ ధ్వంసం**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట అక్టోబర్ 09 :** ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ ఏసీ మేడం పర్యవేక్షణలో ప్రత్యేక డ్రైవ్ యాక్షన్ ప్లాన్ ప్రకారం ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సిబ్బంది సిరిసిల్ల డిటిఎఫ్ బృందం సంయుక్తంగా వీర్నపల్లి మండల పరిధిలోని గోలియా నాయక్ తండా భూక్య తండా మద్దిమల్ల తండా బంజారా తండాలలో శుక్రవారం దాడులు నిర్వహించి భూక్యా తండాలో భూక్యా రాజు గంగాద్రి ప్రేమ్యండ్లు అక్రమంగా తయారు చేసిన నాటు సారా ఐడి లిక్కర్ కేసును గుర్తించి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఎనిమిది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకోన్నట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ విజేందర్ రెడ్డి రేండ్ల తెలిపారు.ఈ దాడీలో సబ్ ఇన్స్పెక్టర్ రబ్బాని డిటిఎఫ్ సిరిసిల్ల బృందం ఎక్సైజ్ కానిస్టేబుల్ రవీందర్ మారుతి మహేష్ వర్మ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టం దరఖాస్తులను

# సకాలంలో పరిష్కరించాలి

**-సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి**
**-పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే తీవ్రంగా పరిగణిస్తాం**
**-సమాచార హక్కు వారోత్సవాల సందర్భంగా పౌర సమాచార అధికారులకు అవగాహన కార్యక్రమం**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 9 :** సమాచార హక్కు చట్టం-2005 కింద అందిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని ఉన్నతాధికారులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అక్టోబర్ 5 నుంచి 12వ తేదీ వరకు సమాచార హక్కు వారోత్సవాలు-2026 నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు సమాచార హక్కు చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిల్లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమాచార హక్కు చట్టం కింద పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులు తమకు నిర్దేశించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో తెలుసుకొని విధులు నిర్వహించాలని ఆదేశించారు. చట్టం ప్రకారం ప్రజలకు అందించాల్సిన సమాచారాన్ని పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. దీనివల్ల ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. అధికారుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమాచార హక్కు దరఖాస్తులన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినా, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకపోయినా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. వై ప్రసాద్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కిషన్, సూపరిండెంట్ జ్యోతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### బ్రిడ్జి నిర్మాణ పనులలో

# మరింత వేగం పెంచాలి



**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-గంభీరావు పేట - లింగన్నపేట మధ్య హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట అక్టోబర్ 09 :** గంభీరావు పేట- లింగన్నపేట మధ్య హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో గంభీరావు పేట- లింగన్నపేట మధ్య హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనుల కొనసాగుతుండగా,కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు కార్మికుల సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. 160 మీటర్ల మేర బ్రిడ్జి, రెండు వైపులా కలిపి 300 మీటర్ల మేర అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను నాలుగునెలల్లో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు.వారం రోజుల్లో బ్రిడ్జి పక్క నుంచి అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి రాకపోకలు పునరుద్ధరించాలని సూచించారు.ఆర్ అండ్‌బీ అధికారులు పనులను పరిశీలించాలని ఆదేశించారు. పరిశీలనలో ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, డీఈ శాంతయ్య, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్ పాల్గొన్నారు.

# మలేసియా ఎన్నారై గాజెంగి రంజిత్‌కు సన్మానం



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 9 :** జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన గాజెంగి రంజిత్కు సీఎం ప్రవాసీ ప్రజావాణి వేదికగా అరుదైన గౌరవం లభించింది. మలేసియాలో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న రంజిత్, ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ కార్మికులకు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ శుక్రవారం హైదరాబాద్లోని బేగంపేట ప్రజాభవన్లో నిర్వహించిన సీఎం ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయనను శాలువాతో సత్కరించారు. విదేశాల్లో ఉపాధి పొందుతున్న తెలంగాణ కార్మికులు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలో వారికి అండగా నిలుస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్న రంజిత్ సేవలను ఈ సందర్భంగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ, సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. విద్యాసాగర్, జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సంగనభట్ల దినేష్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీనివాస రావు, స్వదేశ్ పరికిపండ్ల, వాలంటీర్లు గంగుల మురళీధర్ రెడ్డి, గాజుల సంపత్ కుమార్, సీఎం ప్రవాసీ ప్రజావాణి లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి తదితరులు పాల్గొన్నారు.

# ముఫ్తీ అబ్దుల్ మోయిజ్ షామ్జీకి సన్మానం



**-ఇస్లామిక్ లాలో పీహెచ్‌డీ, టీఎస్ లా సెట్‌లో ఉచిత ఎల్ఎల్‌బీ సీటు సాధించిన సందర్భంగా అభినందనలు**

**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 9 :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని బిస్మిల్లా మసీదు ఇమామ్, ఖతీబ్ ముఫ్తీ అబ్దుల్ మోయిజ్ షామ్జీ ఇస్లామిక్ లాలో పీహెచ్‌డీ చేయడంతో పాటు, టీఎస్ లా సెట్ ద్వారా ఉచితంగా ఎల్ఎల్‌బీ సీటు సాధించిన సందర్భంగా శుక్రవారం జుమా నమాజ్ అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, మత పెద్దలు, ముసల్లీలు పాల్గొని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఫ్తీ అబ్దుల్ మోయిజ్ షామ్జీ మెట్‌పల్లి, జగిత్యాల జిల్లాతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రముఖ ముస్లిం మత గురువుగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఇస్లామిక్ మతపరమైన అంశాలపై విశేష పరిజ్ఞానంతో పాటు న్యాయ విద్యను అభ్యసించడం ఆయనకు సమాజానికి మరింత సేవలందించే అవకాశాన్ని కల్పిస్తుందని అన్నారు.ఆయన సేవలు ముస్లిం సమాజానికే పరిమితం కాకుండా అన్ని మతాలకు చెందిన ప్రజలకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకుని ప్రజలకు న్యాయపరమైన అంశాల్లో మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.ముఫ్తీ అబ్దుల్ మోయిజ్ షామ్జీ భవిష్యత్తులో విద్యారంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, సమాజానికి మరింత సేవలందించాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

### ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ నవరాత్రి వేడుకలకు

# చేనేత పట్టుచీరల సమర్పణ



**చురకలు ప్రతినిధి,విజయవాడ, అక్టోబర్ 9 :**ఇంద్రకీలాద్రిపై అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం ఆలయ సాంప్రదాయాల ప్రకారం చేనేత పట్టుచీర, సారెను భక్తిశ్రద్ధలతో పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు బొద్దుల లక్ష్మణ్ సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముల్లోకాలను రక్షించే ఆ జగజ్జనని సేవలో పాల్గొనడం, నవరాత్రుల వేళ అమ్మవారికి పట్టుచీరనుబహూకరించడం పూర్వజన్మ సుకృతమని కొనియాడారు. తెలుగు రాష్ట్రల ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.ఆలయ అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించి,వేద ఆశీర్వచనం, తీర్థప్రసాదాలను అందజేశారు. తెలంగాణ పద్మశాలిలకు అమ్మవారి సేవలకు గాను లభించిన భాగ్యంగా భావిస్తున్నట్టు వారు తెలిపారు.కనకదుర్గ అమ్మవారికి చేనేత పట్టువస్త్రాలు అందజేత అపూర్వ భాగ్య సంకల్ప కార్యక్రమంఅఖిల భారత పద్మశాలి సంఘం,తెలంగాణ రాష్ట్ర సంఘాలు కలిసి వెళ్లాయి.అధ్యక్షులు కందగట్ల స్వామి నేతృత్వంలో విజయవాడ శ్రీ కనకదుర్గ దేవాలయం ట్రస్ట్ బోర్డు మెంబెర్ జి.వి.నాగేశ్వరరావు, శ్రీనివాస్ రావుల ఆధ్వర్యంలో అఖిల భారత పద్మశాలి సంఘం,తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రముఖులు, నాయకులు అమ్మవారికి చేతితో నేసిన చేనేత వస్త్రాలు 10 రోజులకు గాను 10 పట్టు చీరలు సమర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల చేనేత కళాకారులు,నాయకులు గడ్డం జగన్నాథం,వనం విశ్వనాథం, దుష్యంతల,బొల్ల శివశంకర్, రాపోలు సుధాకర్,బొద్దుల లక్ష్మణ్, మెతుకు సత్యం,గుర్రం శ్రావణ్ కుమార్, గుంటక రూప,పోరండ్ల శారదా,నోముల రేఖ, చిన్నకోట్ల స్వప్న గుర్రం విశ్వేశ్వర్ రావు, కర్నాటి విజయ్, కైరంకొండ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

